క్లుప్తంగా

కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి


ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్న తరుణంలో కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైతాంగం కరువు బారిన పడి అల్లాడిపోతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. అన్నదాతను ఆదుకోవడానికి చర్య లు తీసుకోకపోవడం అన్యాయమమన్నారు. వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని కోరారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల కోరారు. మంగళవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీల చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాయిబాబా, ఆర్ నరసింహులు, మా రేళ్ల రామాంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు జాషువా జయంతి సభ

కర్నూలు కల్చరల్: కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో బుధవారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సభను నిర్వహించనున్నట్లు తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ జి.ప్రమీల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన

కర్నూలు(సెంట్రల్): పోలీసుల తీరును నిరసిస్తూ సీపీఎం నాయకులు రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తన ఇంటి నుంచి వస్తుండగా కిసాన్ ఘాట్ వద్ద ట్రాఫిక్ ఏఎస్ఐ, కానిస్టేబుల్ అడ్డగించి రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. కాగా తనపై పోలీసులు దాడి చేశారని రామకృష్ణ సమాచారం ఇవ్వడంతో సీపీఎం నాయకులు పి.నిర్మల, కేవీ నారాయణ, ఎండీ ఆనంద్‌బాబు, రాజశేఖర్, రాముడు, విజయ్, నరసింహ అక్కడికి చేరుకొని పోలీసు స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. తక్షణమే ఏఎస్ఐ, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐ శ్రీనివాసులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

భక్తితో పులకించిన పుట్లూరు


అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో వెలసిన శ్రీమాతా మారెమ్మ బ్రహ్మోత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మంగళవారం గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి మొక్కులు తీర్చుకునేందుకు చుట్టుపక్కల గ్రామాలు, జిల్లాలు, రాష్ట్రాలనుంచి తరలి వచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసింది. ఎస్ఐ సురేశ్ బందోబస్తు నిర్వహించారు.

నేడు, ఎల్లుండి బండలాగుడు పోటీలు

27న బుధవారం పాల పళ్ల విభాగంలో రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు. రూ.12 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే 29న శుక్రవారం సీనియర్స్ విభాగంలో బండలాగుడు పోటీలు న్నాయన్నారు. విజేతలకు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు అందిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వృషభ యజమానులు 86393 63721, 75693 90793 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



పెద్దమార్కెట్ నుంచి కొండారెడ్డి బురుజు మీదుగా వినాయకుని నిమజ్జన ఊరేగింపు, నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్


సంబరాల్లో యువకులు


రాజ్‌విహార్ సర్కిల్‌లో శోభాయాత్రను తిలకిస్తున్న నగర ప్రజలు

అంబరం.. గణపయ్య సంబరం



వినాయక నిమజ్జన సంబరం అంబరాన్నంటింది. గణపతి బప్ప మోరియా, జై బోలో గణేష్ మహరాజ్‌కి జై, ఉండ్రాలయ్యా ఉంటామయ్యా నినాదాలతో నగరం దద్దరిల్లింది. అశేష భక్తజనం మధ్య మంగళవారం గణనాథుల ఊరేగింపు కడు రమణీయంగా సాగింది. నగర వాసులు కేసీ కెనాల్ వినాయక ఘాట్‌కు చేరుకుని గణనాథుడికి వీడ్కోలు పలికారు.
– కర్నూలు టౌన్/హాస్పిటల్/సెంట్రల్/రాజ్‌విహార్

వినాయక్ ఘాట్‌లో క్రేన్ సాయంతో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం


రాంబొట్ల దేవాలయం వద్ద శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, ఎంపీ, ఎస్వీ మోహన్‌రెడ్డి

● అన్నదానం..


భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు నగరంలోని పెద్దమార్కెట్ వద్ద, బుధవారపేట వద్ద ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారాం నగర్‌లో అన్నదానం చేశారు. సి.క్యాంప్‌లోని రెవెన్యూ క్వాటర్స్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


భక్తులకు భోజనం వడ్డిస్తున్న సురేందర్‌రెడ్డి

● చిందేసిన కమిషనర్


డాన్స్ చేస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

నగరపాలక సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద కమిషనర్ భార్గవ్‌తేజ చిందేశారు. పూజల అనంతరం శోభాయాత్ర ప్రారంభ సమయంలో కమిషనర్ డాన్స్ చేసి ఉద్యోగులను ఉత్సాహపరిచారు. అంతకుముందు ఇంజినీరింగ్ విభాగం అధికారులు వేలంపాటలో లడ్డూను రూ.50 వేలకు దక్కించుకున్నారు. స్వామి వారి శేష వస్త్రాన్ని నగరపాలక అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్ రూ.12 వేలకు దక్కించుకున్నారు.

● పరిపాలనా గణనాథుడికి ఘన వీడ్కోలు

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలనా గణనాథుడికి ఘన వీడ్కోలు పలికారు. 9 రోజులపాటు వివిధ పూజలు అందుకున్న వినాయకుడు మంగళవారం నిమజ్జనోత్సవానికి తరలి వెళ్లారు. ఈ క్రమంలో ముందుగా గణేష్ మహారాజుకు కలెక్టర డాక్టర్ జి.సృజన, కలెక్టర్ తండ్రి, కర్నూలు జిల్లా పూర్వపు కలెక్టర్ బలరామయ్య, ఆయన సతీమణి సుగుణ, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదనరావు, ఆర్‌డీఓ హరిప్రసాదు, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్ ప్రత్యేక అర్చన, మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం గణనాథుడు ప్రత్యేక వాహనంపై ఊరేగింపుగా వెళ్లాడు. ఈసందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోలాటం ఆడారు.

● గొంతు తడిపిన తాగునీటి కేంద్రాలు

సంబరాల్లో పాల్గొని అలసిపోయిన భక్తులకు నగరపాలక యంత్రాంగం అడుగడుగునా తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేసింది. శోభాయాత్ర, నిమజ్జనాన్ని తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులకు తాగు నీరు అందించింది. అలాగే కేసీ కెనాల్‌తో పాటు బాలాజీనగర్ కేసీ కెనాల్ వద్ద నగరపాలక సంస్థ ఘాట్లు, క్రైన్లు ఏర్పాటు చేసింది. ప్రతి ఘాట్ వద్ద ఉద్యోగులు, కమిటీ సభ్యులు, పోలీసులు పెద్ద సంఖ్యలో నియమించారు.

● వైద్యశిబిరాలు..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నగరంలో పలు చోట్ల ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. వినాయకఘాట్ వద్ద రెండు శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడ వైద్యులు, సిబ్బందిచే మూడు షిఫ్టులలో డ్యూటీలు నిర్వహించారు. పెద్దమార్కెట్, పూలబజార్, ఆర్ఎస్ రోడ్డు, రాజవిహార్, బళ్లారి చౌరస్తా, చెన్నమ్మ సర్కిళ్లలో ప్రథమ చికిత్సా శిబిరాలు ఏర్పాటు చేశారు. అక్కడ ఏఎన్ఎంలచే మందులను అందజేసే ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో నగరంలో పలు చోట్ల ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు.

● టీ షర్టుల పంపిణీ

సి.క్యాంపు లెజెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ కార్పొరేటర్ గుడిపల్లె సురేందర్ టీషర్టులు పంపిణీ చేశారు.


పరిపాలనా వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ సృజన, తదితరులు


భక్తులకు పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం అందజేస్తున్న దృశ్యం


సెంట్రల్ ప్లాజాలో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు


రహదారులు శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది


వినాయకుడి విగ్రహం ముందు నృత్యం చేస్తున్న మహిళలు


వన్‌టౌన్ నుంచి పూలబజార్ మీదుగా వినాయకుని నిమజ్జన ఊరేగింపు



వన్‌టౌన్ ప్రాంతంలో ఊరేగింపును ఆసక్తిగా తిలకిస్తున్న ముస్లింలు, యువత కేరింతలు

ఇంటింటా ఆరోగ్యం

● డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

ఓర్వకల్లు: సాధారణ రోగులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసి అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి స్థానిక హెల్త్‌సెంటర్ ఆవరణంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మండల స్థాయి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడ్, రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రవీంద్రరెడ్డి, జిల్లా అధికారులు, సర్పంచ్, తహసీల్దార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.


హుసేనాపురంలో ఆరోగ్య రక్ష టోకెన్ అందజేస్తున్న దృశ్యం

వీర వనిత చాకలి ఐలమ్మ

కర్నూలు(అర్బన్): తెలంగాణ సాయుధ పోరులో వీరోచితంగా భూపోరాటం నడిపిన వీర వనిత చాకలి ఐలమ్మ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి, రజక ఫెడరేషన్ అధ్యక్షులు రజక శ్రీనివాసులు, బీసీ నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్య, యూనుస్ బాషా, సీపీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రజక ఐక్య సేవా సమితి ఆధ్వర్యంలో..

చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి స్థానిక బీసీ భవన్‌లో రజక ఐక్య సేవా సమితి నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి సీపీ వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు భారతి, జిల్లా అధ్యక్షులు బలరాం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక భవన్‌లో

కర్నూలు(సెంట్రల్): కార్మిక, కర్షక భవన్‌లో ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గురుశేఖర్, నాయకులు శ్రీనివాసులు, సి.శేషాద్రి పాల్గొన్నారు.


ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నేతలు


ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వివాహిత ఆత్మహత్య


మౌనిక (ఫైల్)

రుద్రవరం: మండల పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన మౌనిక (30) అనే వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కర్నూలుకు చెందిన మౌనికను బీరవోలుకు చెందిన నరేష్‌తో పెద్దలు వివాహం చేశారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు సంతానం. కాగా ఆమె గ్రామంలో వలంటీర్‌గా సేవలు అందిస్తోంది. కొంత కాలంగా భార్య భర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో వారి మధ్య తరచూ వాగ్వాదం జరిగేది. దీంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డిని సంప్రదించగా.. ఈఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, మృతురాలు తరపున ఎవరైనా ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆదోని డీఎస్పీ కార్యాలయ సమీపంలో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు స్కూటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో చంద్రకాంత్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మిగనూరులో అమెజాన్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న చంద్రకాంత్ పని ముగించుకొని ఆదోనిలోని భార్యను చూడటానికి వెళ్తున్నాడు. ఆదోని నుంచి కర్నూలువైపు వెళ్తున్న ఏపీ 21 జెడ్ 0716 నెంబర్ గల కర్నూల్–2 డిపో బస్సు ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో చంద్రకాంత్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

శిక్షణ తరగతులను పరిశీలించిన డీఈఓ

● డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి

వెల్దుర్తి: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను మంగళవారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి పరిశీలించారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి అనంతరం శిక్షణలో మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించే పద్ధతులను వివరించారు. అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే ఎఫ్ఏ–2 పరీక్షల నిర్వహణపై తగు సూచనలిచ్చారు. అనంతరం బాలుర హైస్కూల్, బాలికల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికల హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ.. బైజూస్ యాప్‌ను ఉపయోగించుకుని తర్ఫీదు పొందాలని సూచించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు రామునాయక్, చంద్రావతి ఉన్నారు.


వెల్దుర్తిలో స్కూల్ కాంప్లెక్స్ ట్రైనింగ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి

రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతాం


● ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను రైతు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం కర్నూలు ఏ.క్యాంపులోని ఉద్యాన భవన్‌లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పనిచేస్తున్న రైతు శాస్త్రవేత్తలు, మెంటర్స్ తదితరులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సహజసిద్ధ సాగు పద్ధతులు, మోడల్స్‌పై శిక్షణ ఇవ్వడం వల్ల వారి స్వంత భూముల్లో ప్రకృతి వ్యవసాయ నమూనాలను ఏర్పాటు చేయాలన్నారు. రీజినల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ చక్రాల చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని ఏ విధంగా తగ్గించుకోవచ్చనే దానిని మోడల్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించవచ్చన్నారు. కెమికల్స్ లేకుండా పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉందన్నారు. నేలను సారవంతం చేసేందుకు ఘన, ద్రవ జీవామృతంతో పాటు నవ ధాన్యాలలు వేసుకోవాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలను ప్రభుత్వం ప్రత్యేకంగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. సమావేశంలో కన్సల్టెంట్ రాజేశ్వర్, సీనియర్ అసోసియేట్ వరలక్ష్మి, థిమాటిక్ పాయింట్ పర్సన్ చిరంజీవి, జిల్లా పాయింట్ పర్సన్స్ శ్వేత, సలీమ్, సందీప్ డీపీఎంయూ సభ్యుడు మల్లికార్జున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

ఇంటింటికీ 'జగనన్న ఆరోగ్య రక్ష'

కర్నూలు(హాస్పిటల్): ఇంటింటికీ ఆరోగ్య రక్ష నినాదంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ పరిధిలోని స్టాంటన్‌పురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వేను డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట వలంటీర్లు ఇంటింటికి తిరిగి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం గురించి కరపత్రం పంపిణీ చేసి అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం ఏఎన్ఎం, సీహెచ్‌ఓలు ఇంటింటికీ తిరిగి అవసరమైన వారికి ఏడు రకాల ఆరోగ్య పరీక్షలైన బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, యూరిన్, గల్ల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వాటి ఫలితాలను జేఏఎస్ యాప్‌లో నమోదు చేసి ఆరోగ్య సేవలు అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ ఇచ్చి సెప్టెంబర్ 30వ తేదీ నుంచి విలేజ్ హెల్త్ క్లినిక్/యూపీహెచ్‌సీలలో ఇద్దరు ఎంబీబీఎస్‌లు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులచే నిర్వహించే వైద్యశిబిరాలకు తరలించి తగు చికిత్సలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కోడి పందేలపై పోలీసుల దాడులు

కృష్ణగిరి: మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామ శివారు ఎల్లమ్మ గుడి వద్ద జరుగుతున్న కోడి పెందేలపై ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. దాడులలో కోళ్ల పెందెం ఆడుతూ ఆరుగురు పట్టుబడినట్లు, ముగ్గురు పారిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడ్డ వారి వద్ద నుంచి రూ.4500లు, రెండు నాటు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.